
ప్రజాశక్తి
మంగళవారం 4 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



నేడు చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, కొండపల్లి గౌరినాయుడు, జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ రఘుమండల ధనుంజయ నాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 154 ప్రభుత్వ పాఠశాలలు, 21 ప్రైవేట్ పాఠశాలల్లో ఈ సంబరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గత నెల 18న జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు మండల స్థాయిలో పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈనెల 23న జిల్లా కేంద్రంలో జరిగే జిల్లా స్థాయి సంబరాలకు హాజరుకానున్నట్లు తెలిపారు.

సమస్యలిలా... చదువు సాగేదెలా?

- పోస్ట్ మెట్రిక్ హాస్టల్ లో సమస్యల కొలువు
- మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఉన్నత చదువు చదవాలని, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని ఎంతో ఆశ, ఆశయం, సంకల్పంతో దూరదూర ప్రాంతాల నుంచి చదువుకునేందుకు వస్తున్న గిరిజన విద్యార్థులకు వసతి గృహంలో సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. వందలాదిమంది విద్యార్థులు ఉన్నచోట స్నానం నుంచి భోజనం వరకు వారు పడుతున్న సమస్యలు వర్ణనాతీతం. దీంతో ఆ విద్యార్థులకు ఉన్నత విద్యపై ఆశలు సన్నగిల్లిపోతున్నాయి. నిర్మాణంలో ఉన్న భవనాలపై అధికారులు దృష్టి సారించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ఐదు కళాశాలలకు సంబంధించి విద్యార్థులు స్థానికంగా ఉండి చదువుకునేందుకు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ పై అన్ని కళాశాలల నుంచి 500 మంది విద్యార్థుల వరకు ఉంటున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో విద్యార్థులు ఉన్నా చాలీచాలని మరుగుదొడ్లు, స్నానం గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 500 మంది విద్యార్థులకు 17 మరుగుదొడ్లు ఉన్నా అందులో ఒకటి మాత్రమే వినియోగంలో ఉంది. 17 స్నానపు గదులకు పది మాత్రమే వినియోగిస్తున్నారు. వందలాది మంచి విద్యార్థులకు మరుగుదొడ్లు, స్నానపు గదులు ఒకే సమయంలో ఇబ్బందిగా మారడంతో పలువురు ఆరుబయటే కాలకృత్యాలు, స్నానాలు చేస్తున్నారు. నిర్మాణంలో 12 మరుగుదొడ్లు గత రెండు నెలలుగా పూర్తికాని పరిస్థితి. నీటి సరఫరా లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇది ఇలా ఉంటే భోజనశాల, స్నానపు గదుల నిర్మాణ పనులు గత కొన్నేళ్లుగా మధ్యలోనే అర్థాంతరంగా నిలిచిపోయాయి.

500 మందికి ఒక్కరే వంట కుక్

500 మంది విద్యార్థులున్నచోట వంట కుక్కు, వాచ్ మెన్ ఒకర్నే



నీటి సరఫరాలేక నిరుపయోగంగా ఉన్న కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు

ఎఎన్‌ఎంలను నియమించాలి

వసతి గృహంలో విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించిన ప్రభుత్వం తక్షణమే ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే దూర ప్రాంతంలో ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. కళాశాల పనివేళల్లో ఆసుపత్రులకు వెళ్లడం ద్వారా తరగతులకు దూరం కావాల్సి వస్తుంది. వందలాదిమంది విద్యార్థులు ఉన్నచోట ఎఎన్‌ఎం లను నియమిస్తే వారం వారం ఆరుగురు పరీక్షలు చేయడానికి వీలుంటుంది.

బి.శ్రీను,
బికాం, సెకెండ్ ఇయర్



అర్థాంతరంగా నిలిచిన భోజన గది భవనం

ప్రభుత్వం నియమించింది. వందలాది మంది విద్యార్థులకు సకాలంలో భోజనాలు అందించలేని పరిస్థితి. స్థానిక వార్డెన్ అదనంగా వంట కుక్కులను పెట్టుకుని నెల నెలా వేలాది రూపాయలు వేతనం చెల్లిస్తున్న పరిస్థితి. ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఈ సమస్య వెంటాడుతుంది. విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య కార్యకర్తల్లేని పరిస్థితి. వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం రెండు మోటారు బోర్లు ఉన్నాయి. విద్యుత్ లేని సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చేతి పంపు బోర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే విద్యార్థులు తాగేందుకు శుద్ధ జలం ఆర్వో ప్లాంట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం బాధాకరం. ప్రభుత్వం జిల్లా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎఎన్‌ఎంలను నియమించాలి

వసతి గృహంలో విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించిన ప్రభుత్వం తక్షణమే ఆరోగ్య కార్యకర్తలను నియమించాలి. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే దూర ప్రాంతంలో ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుంది. కళాశాల పనివేళల్లో ఆసుపత్రులకు వెళ్లడం ద్వారా తరగతులకు దూరం కావాల్సి వస్తుంది. వందలాదిమంది విద్యార్థులు ఉన్నచోట ఎఎన్‌ఎం లను నియమిస్తే వారం వారం ఆరుగురు పరీక్షలు చేయడానికి వీలుంటుంది.

బి.శ్రీను,
బికాం, సెకెండ్ ఇయర్.

మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం

పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. చాలామంది విద్యార్థులు ఆరు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి. నిర్మించిన మరుగుదొడ్లకు వాటర్ కనెక్షన్ ఇచ్చి అధికారులు వెంటనే ప్రారంభించాలి.

ఎ.సాయికుమార్
ఎంపిసి, సెకెండ్ ఇయర్

వినతులు అందజేయడమేనా?

కానరాని సమస్యల పరిష్కారం మొక్కుబడి తంతుగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ వేర్వేరు సమస్యలపై వినతులు అందజేయడమే కనిపిస్తోంది తప్ప పరిష్కారం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. గత రెండు వారాలుగా సోమవారం సెలవులు ప్రకటించడంతో గ్రీవెన్స్ సెల్ నిర్వహించకపోవడంతో ఈ వారం అధిక సంఖ్యలో బాధిత ప్రజలు హాజరయ్యారు.

తుపానుకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

మొంథా తుఫాన్ వల్ల వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, దీంతో రైతులు అగమ్యగోచర స్థితిలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం నష్టపరిహారంతో ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సోమవారం కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డికు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘంజిల్లా అధ్యక్ష కార్యదర్శులు



గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి మాట్లాడుతూ మొలకెత్తిన మొక్కజొన్న, వరి, రంగు మారిన పత్తిని ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి కోతకు రావడంతో ప్రభుత్వం ఎటువంటి కొనుగోలు ప్రక్రియ చేపట్టకపోవడంతో తయారైన ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులు రూ.1700 నుండి రూ.1900 వరకు కొనుగోలు చేపట్టి రైతులను మోసగిస్తున్నారని పేర్కొన్నారు. దీన్నిరైతు సంఘం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం కలుగజేసుకొని కనీసం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేపట్టాలని, ప్రైవేట్ వ్యాపారులను నియంత్రించాలని, కూరగాయలు, ఉద్యానవ పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, అలాగే అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు వెంటనే కౌలు రైతులకు జమ చేయాలని, కొత్త కౌలు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గేదెల సత్యనారాయణ, రెడ్డి లక్ష్మునాయుడు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సొసైటీలో లక్షల అవినీతి : చర్యలు తీసుకోవాలని వినతి

గరుగుబిల్లిలో గల శ్రీ కోదండరామ చేనేత సంఘంలో జరిగిన రూ.9లక్షల అవినీతిపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం సభ్యులు అయిక మచ్చన్న, నాగభూషణం, సీరాపు సింహాచలం, సత్యం డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షులు అయిక తవుడు, కొంతమంది అధికారులు కలిసి లక్షల అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. సంఘానికి సంబంధించిన వస్తువులు, సామగ్రి అమ్మేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చేనేత కుటుంబాలను ఆదుకోవాలి

జిల్లాలోని చేనేత కుటుంబాలను ఆదుకోవాలని, మొంథాన్ తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయారని గరుగుబిల్లి మండలంలోని పెద్దూరు, రావుపల్లి, గరుగుబిల్లి, రాయి వలస, నాగూరు గ్రామాల చేనేత కార్మికులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నష్టపోయిన చేనేత కుటుంబాలకు రూ.50 కిలోల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని మార్గదర్శకాలు జారీ అయ్యాయని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

పిజిఆర్ఎస్‌కు 188 అర్జీలు

సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 188 అర్జీలు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐటిడిఎలో గ్రీవెన్స్

సీతంపేట: స్థానిక ఐటిడిఎలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీగా 123 అర్జీదారులు హాజరై తమ వ్యక్తిగత సమస్యలపై వినతులు సమర్పించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, ఉపాధి హామీ ఎపిడి శ్రీహరిరావు, ఎడి శ్రీనివాసరావు, డిపిఎం రమణ, డిఇ నాగభూషన్, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మూడు సార్లు వినతిచ్చినా కానరాని పరిష్కారం

కురుపాం మండలంలోని వలసబల్లేరు పంచాయతీ ఆగంగూడ గిరి శిఖర గ్రామం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు ఇంతవరకు మూడు సార్లు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి మూడు సార్లు వినతులు అందజేశారు. కానీ సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. ఆగంగూడ గ్రామానికి 400మీటర్ల దూరం వరకు రోడ్డు నిర్మాణం చేసి వదిలేశారని, దీని వల్ల తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ కార్యాలయం లో మూడు సార్లు చొప్పున పిర్యాదు చేసినా పరిష్కారం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టం కింద మంజూరైన నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు.



కురుపాంలో గిరిజన గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న జడ్జి కృష్ణప్రసాద్

ఖైదీల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

సీనియర్ సివిల్ జడ్జి కృష్ణ ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఖైదీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి, సెక్రటరీ ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన స్థానిక సబ్ జైలును ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులోని ఖైదీల స్థితిగతులు, ఆహార వసతులు, ఆరోగ్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. జైలు సిబ్బంది విధుల పట్ల క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలని సూచించారు. తనిఖీ సందర్భంగా జైలు సూపరింటెండెంట్, ఇతర సిబ్బందితో ప్రధాన న్యాయమూర్తి మాట్లాడి, ఖైదీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. జైలులో పరిశుభ్రత, వైద్య సదుపాయాలు, భద్రతా వ్యవస్థలపై తగిన సూచనలు ఇచ్చారు. ఖైదీలతో వ్యక్తిగతంగా మాట్లాడిన జడ్జి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన సదుపాయాలను మెరుగుపరచడంపై చర్చించారు. ఈ తనిఖీలో జిల్లా న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, జైలు అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

గురుకులం ను సందర్శించిన జిల్లా లీగల్ కార్యదర్శి

కురుపాం : మండల కేంద్రంలో గల శివ్వన్నపేటలో ఉన్న ఏకలవ్య, గిరిజన గురుకుల సంక్షేమ బాలికల పాఠశాలను విజయనగరం జిల్లా లీగల్ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్, కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి సౌమ్యజోస్పిన్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, పరిసరాలు, వంట గది, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. అనంతరం కురుపాంలో న్యాయఅవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులు ఆక్రమణకు గురైతే అధికారులపై చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం



ఆలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పిజిఆర్ఎస్ ద్వారా అందిన రెవెన్యూ వినతులపై స్పష్టత ఉండాలని కలెక్టర్ డాక్ట ఎన్.ప్రభాకరరెడ్డి రెవెన్యూ అధికారులకు తేల్చిచెప్పారు. అర్జీల పరిష్కారం చట్టాలకు లోబడి మాత్రమే చేపట్టాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా పెండింగ్ అర్జీలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ వాటిని ఎలా పరిష్కరించాలో అధికారులకు వివరించారు. ఇప్పటివరకు పెండింగులో ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. జిల్లాలో నీటి వనరులు, చెరువులు ఆక్రమణకు గురైనట్లు సర్వేయర్ ద్వారా తహశీల్దార్ దృష్టికి వస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు సిఫారసు చేయాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు.

డిగ్రీ కాలేజీల్లో 'ముస్తాబు'

జిల్లాలో ముస్తాబు కార్యక్రమాన్ని కళాశాల విద్యార్థుల వరకు అమలు చేయాలని కలెక్టర్ ఎంపిడిఒలను ఆదేశించారు. శత శాతం విద్యార్థులకు డెంటల్ చెకప్ చేయిద్దామని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అవసరమైతే అక్కడే వైద్యం చేయిద్దామని కలెక్టర్ చెప్పారు. మా ఊరికి మలేరియా వచ్చింది, డ్రైడే ఫ్రైడే కచ్చితంగా పాటించాలని అన్నారు. రోడ్డు లేని గ్రామాలు, అంబులెన్సు వెళ్లలేని గ్రామాలు జిల్లాలో ఉండరాదని, అటువంటి గ్రామాలను గుర్తించి వివరాలు తమకు అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్.దిలీప్ చక్రవర్తి, డిఆర్డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, డిపిటిఒ పి.వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ డిడి విజయశాంతి, ఇఇ మణి, ఎపిసి ఆర్.తేజేశ్వరరావు, మండల తహసీల్దార్లు, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతే ముఖ్యం

మండలంలోని అడ్డాపుశిల వద్ద గల కాశీవిశ్వేశ్వర దేవాలయాన్నికలెక్టర్ డా.ఎన్.ప్రభాకరరెడ్డి సోమవారం సందర్శించి భద్రతా ఏర్పాట్లను జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కార్తీకమాసం సోమవారం కావడంతో శివాలయం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో చేపట్టిన పటిష్ట భద్రతా చర్యలను కలెక్టర్ జెసీతో పరిశీలించి సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు, మార్గదర్శకాలను జారీచేశారు. భక్తులు క్యూ మార్గంలో వెళ్లాలని, ఎటువంటి తోపులాటలు జరగకుండా చూడాలని పేర్కొన్నారు. ఇకపై జనసంద్రం ఉన్న ప్రతి చోటా ఇటువంటి చర్యలే చేపట్టాలని, ప్రజల భద్రతే ముఖ్యమని కలెక్టర్ అధికారులకు ఉద్బోధించారు. పోలీస్ సిబ్బందితో పాటు పాల్గొన్న ఎన్‌సిసి, ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు, విద్యార్థిని, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, తహశీల్ధార్ ఎం.సురేష్, పోలీస్ అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాబు పాలనలో భద్రత కరువు

కొవ్వొత్తుల ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి - సాలూరు

సిఎం చంద్రబాబు నాయుడు పాలనలో సామాన్య భక్తులకు భద్రత కరువైందనిమాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని వెంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన వారికి సంతాపంగా సోమవారం రాత్రి వైసిపి ఆధ్వర్యాన కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎప్పుడు సిఎంగా ఉన్నా జన, ఆస్తినష్టం సాధారణమయా ్యయని ఎద్దేవా చేశారు. ఏడాదిన్నర పాలనలోనే మూడు ప్రముఖ దేవాలయాల్లో చోటు చేసుకున్న తొక్కిసలాటల్లో 20మందిపైగా భక్తులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే తొక్కిసలాట సంఘటనలు జరుగుతున్నాయని చెప్పారు. సనాతన ధర్మానికి తానే అసలైన మద్దతుదారునని గొప్పలు చెప్పుకొంటున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సంఘటనలపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

డైవర్షన్ కోసమే జోగి రమేష్ అరెస్టు

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కాశీబుగ్గ ఆలయంలో జరిగిన తొక్కిసలాట సంఘటనను మరుగున పెట్టడానికే ప్రభుత్వం మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు డ్రామాను తెరపైకి తీసుకొచ్చిందని రాజన్నదొర చెప్పారు. కల్తీ మద్యం కేసులో టిడిపి నాయకులను రక్షించడానికి వైసిపిపై ప్రభుత్వం బురద జల్లుతోందని ఆరోపించారు. కల్తీ మద్యంపై సిబిఐ విచారణ జరిపించాలని ఇప్పటికే వైసిపి అధినేత జగన్ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు పిరిడి రామకృష్ణ, కాకి పాండురంగ పాల్గొన్నారు.



పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న రాజన్నదొర, వైసిపి నాయకులు

గ్రీన్ అంబాసిడర్ల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పంచాయతీల్లో పని చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, ఆ సంఘం కార్యదర్శి జె.గౌరీ, చంటి మాట్లాడుతూ గతంలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా క్లాప్ మిత్రాలకు అకౌంట్లో నేరుగా వేతనాలు పడేవని, 2023 తర్వాత పంచాయతీలకు వీరిని అప్పగించడంతో ప్రతినెలా సక్రంగా వేతనాలు అందడం లేదన్నారు. దీంతో వీరు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చిరుద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం ఏడాది పాటు జీతాలు చెల్లించకుండా బకాయిలు పెడితే కుటుంబాలను ఎలా పోషించుకోగలరని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ అలవెన్స్ రూ.4000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిక్షా మరమ్మతులు సొంత ఖర్చులతో గ్రీన్‌అంబాసిడర్స్ చేయించుకుంటున్నారని, కనీసం పంచాయతీ సెక్రటరీలు మరమ్మతులకు బిల్లు డబ్బులు చెల్లించడం లేదని చెప్పారు.

సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పంచాయతీ సెక్రటరీలకు గ్రీన్ అంబాసిడర్లకు జాయింట్ మీటింగ్ నిర్వహించాలని కోరారు. అనంతరం డిఆర్వో హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదియ్య, సోములు, రాము, రాజేష్,, ప్రసాద్, వెంకటేష్, మన్మధ, పాల్గొన్నారు.

వెనుకబాటుకు పాలకులే కారణం : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ నియోజకవర్గం పూర్తిగా వెనుకబడ్డానికి పాలకులే కారణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. సోమవారం జరిగిన స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పాలకొండ బహిరంగ సభలో పాలకొండ అభివృద్ధి కోసం అనేక హామీలు ఇచ్చారని, అయితే ఏడాదిన్నర కావస్తున్నా ఇంతవరకూ ఏ ఒక్క హామీ అమలు చేయలేదని విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా నుంచి విభజన ప్రక్రియలో మన్యంలో వచ్చినప్పటికీ ఇప్పటికీ వెనకబడే ఉందన్నారు. డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో కాలువలు సరిగ్గా లేవన్నారు. రోడ్డు విస్తరణ చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కూడా పాలకొండ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఐటిడిఎను నిర్వీర్యం చేస్తున్నారన్నారని విమర్శించారు. పాలకొండ డంపింగ్ యార్డు సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. నియోజకవర్గంలో పదివేల ఎకరాల్లో పత్తిపంట సాగవుతున్నప్పటికీ భామిని మండలం తూతూ మంత్రంగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. తోటపల్లి నీరు నేటికీ శివారు ప్రాంతాలకు అందే పరిస్థితి లేదన్నారు. నెల రోజుల్లో ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలని, లేని పక్షంలో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు తిరుపతిరావు

దశలవారీగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.రమణారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పలు సమస్యలు పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వస్తున్నారన్నారు. కావున నెల రోజుల్లో నియోజకవర్గ అభివృద్ధికి కార్యాచరణ చేపట్టాలని, లేకుంటే సిపిఎం ప్రజలను, వివిధ వర్గాల వారిని ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు కె.భానుచందర్, కె.రాము, డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే ఉండాలి : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో చేపడుతున్న రీసర్వేపై జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. మండలాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్న ఆయన రెవెన్యూ, సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు. పక్కా రికార్డులతో భూయజమానుల సమక్షంలోనే, తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే చేపట్టాలని ఆదేశించారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ కూడా పక్కాగా ఉండాలన్నారు. అనంతరం దేవాలయాల నిర్వహణపై తహశీల్దార్లు, దేవాదాయ శాఖ సిబ్బందితో సమీక్షించారు. రెవెన్యూ, పోలీస్, దేవాదాయ, ఇతర శాఖలు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, తహశీల్దార్లు, సర్వేయర్లు, డిటిలు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రైస్ మిల్లు కార్మికులతో ఒప్పందం చేయాలి

కళాసీల సంఘం, సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణంలోని రైస్ మిల్లుల కార్మికులకు పీస్ రేట్ ఒప్పందం చేయాలని కోరుతూ సోమవారం సిఐటియు ఆధ్వర్యాన రైస్ మిల్లుల కార్మికులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, కోశాధికారి గొర్లె వెంకటరమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ పార్వతీపురం రైస్ మిల్ యజమానులకు రైస్ మిల్ కళాసీలకు మధ్య కొత్త అగ్రిమెంట్ చేయాల్సి వుందని చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్‌తో ఈ అగ్రిమెంట్ ముగిసిందని తెలిపారు. మిల్లు యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినా ఇంతవరకు స్పందించలేదన్నారు. కావున అధికారులు కలుగజేసుకొని వేతన ఒప్పందం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెరుగుతున్న నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైస్ మిల్లు కళాసీ సంఘం నాయకులు కృష్ణ స్వామి, ప్రసాదు, సత్యం, రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

జిల్లా సాధనకు ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ జిల్లా సాధనకు సోమవారం జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కోట దుర్గ ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. మన్యం వద్దు పాలకొండ ముద్దు అంటూ నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ పాలకొండను జిల్లా చేయాలని, లేనిచో పాత రెవిన్యూ డివిజన్ శ్రీకాకుళంలో కలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి, సాధన సమితి ప్రతినిధులు చౌదరి నాయుడు, బి.అప్పలనాయుడు, పట్టణ వైసిపి అధ్యక్షులు వెలమల మన్మధరావు, కడగల రమణ, తుమ్మగుంట శంకర్, వెన్న శేఖరు, రామకృష్ణ, బాసూరు కాంతారావు, దుంపల చిన్ని, అక్కల నాయుడు తదితరులు ఉన్నారు.

నాలుగు రోజుల్లో ప్యాచ్ వర్క్ పనులు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రానున్న నాలుగు రోజుల్లో ప్యాచ్ వర్క్ పనులు చేపడతామని ఆర్అండ్‌బి డిఇఇ బి.రాజేంద్ర కుమార్ తెలిపారు. 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన 'ప్రమాదం జరిగితే కానీ స్పందించరా' అన్న వార్తకు ఆయన సోమవారం స్పందించారు. పార్వతీపురం నుంచి కూనేరు వరకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి పార్వతీపురం పాత బస్టాండ్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతిందన్నారు. ఈ వర్షాలు కారణంగా మెయింటనెన్స్ పని కూడా చేపట్టడం కుదరలేదన్నారు. మంగళవారం నాటికి తాత్కాలికంగా ఆ గుంతలను కప్పి, రానున్న నాలుగు రోజుల్లో ప్యాచ్ వర్క్ పనిని చేపడతామని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

రాళ్లపైనే గుంపసోమేశ్వర ఆలయానికి దారి



రాళ్లు తేలిపోయిన ఆలయానికి వెళ్లే రోడ్డు

కొమరాడ : మండలంలోని గుంపు సోమేశ్వర స్వామి ఆలయానికి కార్తీక మాసంలో భక్తులు భారీగా దర్శనం కోసం తరలివస్తూ ఉంటారు. గతంలో దాతలు సహకారం అభివృద్ధి కమిటీ స్వచ్ఛందంగా రోడ్డు వేసుకొని రాకపోకలకు సౌకర్యం కల్పించారు. ఇటీవల నాగావళ్లి నది ఉగ్రరూపం దాల్చడంతో రోడ్డు మొత్తం కోతకు గురైంది. గతంలో ప్రభుత్వం బీటీ రోడ్డు రహదారిపై రాళ్లు వేసి విడిచిపెట్టడంతో ఆ రాళ్ళు ఇప్పుడు పైకి తేలిపోయి యాత్రికుల నడకకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. గట్టు పూర్తిగా కోతకు గురవడంతో వాహనాలపై ఆలయం వద్దకు వెళ్లలేకపోవడంతో ఆలయానికి కొంత దూరంలో వాహనాలను విడిచిపెట్టి రాళ్లు తేలిన రోడ్డుపై నడుచుకుని వెళ్లేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా రహదారిపై ఉన్న రాళ్లను తొలగించి భక్తులు రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

పార్వతీపురం: స్థానిక ఐటిడిఎ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో, గురుకుల పాఠశాలల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని గిరిజన సంఘాలు సోమవారం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డికు వినతిపత్రం అందజేశారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలోని హడ్డుబంగి విద్యార్థిని మృతి చెందితే అక్కడి ఐటిడిఎ పిఒ రూ.2లక్షలు పరిహారం చెల్లించారని, ఐటిడిఎలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కుటుంబానికి ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. ఆ విధంగా పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని మృతి చెందిన నలుగురు విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, ఐ.రామకృష్ణ ఉన్నారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

పార్వతీపురం : బలిజిపేటలోని సర్వే నెంబర్ 32/2లో ఉన్న ప్రభుత్వ మెట్ట భూమిని కొంతమంది ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన ఎం.పోలారావు, ఎం.తవుడమ్మ జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేసి ఆక్రమణకు సిద్ధం చేశారని, తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని చెప్పారు. గతనెలలో సబ్ కలెక్టర్ వైశాలి విచారణ జరిపి ప్రభుత్వ భూమి చుట్టూ కంచె తొలగించాలని ఆదేశించినా తహశీల్దార్ బాలమురళీకృష్ణ బేఖాతరు చేశారని తెలిపారు. ఆక్రమణదారులతో తహశీల్దార్ కుమ్మక్కై చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కురుపాం : టిడిపి సీనియర్ కార్యకర్త బలగ రామకృష్ణ, కృష్ణవేణి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సోమవారం వారి ఇంటికెళ్లి పరామర్శించి యోగక్షేమాలను తెలుసుకుని తొందరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, ట్రైకార్ బోర్డు మెంబర్ పువ్వల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణం పూర్తి

సీతానగరం : ఉపాధిహామీ నిధులు రూ.కోటీ 90 లక్షలతో నిర్మించిన మండలంలోని సుమిత్రాపురం నుంచి వల్లర గొడవ రోడ్డు పూర్తయినట్లు మండల టిడిపి కార్యదర్శి, ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ రౌతు వేణు గోపాలనాయుడు తెలిపారు. రోడ్డు పనులకు గతేడాది అక్టోబర్ 24న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శంకుస్థాపన చేశారన్నారు. అప్పటి నుంచి పనులు శరవేగంగా చేయడంతో త్వరగా పూర్తయిందన్నారు. దీంతో ఎన్నో ఏళ్లనాటి కల నిజమైందని ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణంతో రాక పోకలకు సౌకర్యం ఉంటుం దని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా రు. ఈ మేరకు ఎమ్మెల్యే అభినం దనలు తెలుపు తున్నట్లు వేణు గోపాల నాయుడు తెలిపారు.



నిర్మాణం పూర్తయిన సమిత్రాపురం-

పాఠశాలలు, హాస్టళ్లలో రాత్రి బస చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, డిప్యూటీ ఎంపిడిఒలు సిబ్బంది సకాలంలో విధులకు వస్తున్నదీ, లేనిదీ పరిశీలించాలని, అలాగే తరచూ పర్యటనలు చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు తరచూ ఆయా ప్రాంతాల్లో పర్యటనలు చేయాలని, ఒక రాత్రి బస చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఏ పని మీద క్యాంపు వెళ్లినా అక్కడ ఉండే పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రాలను పర్యటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని, ఇందుకోసం నెలలో రెండు, మూడు రోజులైనా ఎంపిడిఒలు, మండల ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాలని, కొన్నిసార్లు వేకువజామునే కూడా తనిఖీలు ఉండాలని అన్నారు. అలాగే సిబ్బందితో తరచూ సమావేశాలు, సమీక్షలు నిర్వహించాలని, ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షేత్రస్థాయిలో పర్యటించాలని పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సమయాల్లో విధులకు హాజరు కాని సిబ్బందిపై ఎటువంటి చర్యలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ లోపాలను సరిదిద్దుకోవాలని, ఈ - ఆఫీస్ ద్వారానే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని ఉద్బోధించారు. పారిశుధ్యంపై డిప్యూటీ ఎంపిడిఒలు గ్రామాల్లో పర్యటించి ప్లాస్టిక్ నివారణపై చర్యలు చేపట్టాలన్నారు. . బహిరంగ మలవిసర్జనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిల్లలు బడికి దూరంగా ఉంటున్న విద్యార్థులపై దృష్టి సారించి బడిలో చేర్పించాలని, బాల్య వివాహాల పట్ల తల్లితండ్రులకు అవగాహన కల్పించి గతంలో మాదిరిగా డిక్లరేషనును పొందాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, సచివాలయ సిబ్బందికి ఐడి కార్డులను మంజూరు చేయాలని అన్నారు సమీక్షా సమావేశంలో జిల్లా అధికారులు, మండల అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కార్మిక, ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాల్టీల్లోనూ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కార్మిక, ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని, లేకుంటే ఈనెల 15, 16తేదీల్లో ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభల అనంతరం పోరాటానికి కార్మిక వర్గం సిద్ధం చేస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ మన్యం జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు తెలిపారు. సోమవారం ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తే కార్మిక సమస్యలన్నీ పరిష్కారమైనట్టు కాదని, రాష్ట్రంలో లక్షలాదిమంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులంతా 12వ పిఆర్సి కమిటీ కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం అది ఇవ్వనప్పుడు, ఐఆర్ ప్రకటించి కార్మికుల వేతనాలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో మాజీ ఎమ్మెల్యేలకు పెన్షన్ పెంచుకొని, కార్మిక వర్గానికి మాత్రం మొండి చేయి చూపించారని విమర్శించారు. మరో పక్క నెల్లూరు, ఏలూరులో పని ప్రైవేటీకరణ చేసే విధానాలను మున్సిపల్‌శాఖా మంత్రి నారాయణ తీసుకువస్తున్నారని, గతంలో జిఒ 279 అమలు చేసినప్పుడు వచ్చే సమస్యలే మరల అమలు చేయాలని చూస్తే కార్మిక వర్గం కోపాన్ని ప్రభుత్వం చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్మికులకు విధులు చెప్పే అధికారులు, ప్రభుత్వం వారు పరిశుభ్రంగా ఉండడానికి సబ్బులు, నూనెలు, చెప్పులు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ సమస్యలను పరిష్కారం చేయకపోతే భవిష్యత్తులో మహాసభల్లో ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునే దానికి వెనుకడుగు వేయమని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మరియు కోశాధికారి, కమిటీ నాయకులు శంకర్, రవి, రాముడు, శ్రీను, పోలరాజు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

పార్వతీపురం : గిరిజన విద్యార్థి సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు భాధిత గిరిజన విద్యార్థిని సాలూరు మండలం అన్నం రాజువలస పంచాయతీ గాదెలవలసకు చెందిన జాడుదొర కుమారితో కలిసి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాడుదొర కుమారి పార్వతీపురం చర్చి వీధిలోని డివిఎంఎం మున్సిపల్ పాఠశాలలో పదో తరగతి చదివిందని, అయితే టెన్త్ మార్కుల మెమోలో కుమారి తల్లి పేరు స్థానంలో అమ్మమ్మ పేరు వచ్చిందని తెలిపారు. ఏడాదిగా పేరు మార్పు చేయాలని కోరుతూ జిల్లా విద్యా శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పై చదువులు నిమిత్తం టెన్త్ అవసరం వస్తుందన్నారు. ఏడాదైనా అటు పాత పదో తరగతి మార్కుల మెమో లేక ఇటు కొత్తది రాకపై చదువుకు ఇబ్బంది పడుతున్నామని వివరించారు. తన సమస్యకు పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కరిస్తామని తెలిపినట్లు రంజిత్ కుమార్ చెప్పారు.

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

వీరఘట్టం: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం వీరఘట్టంలోని చెగిడివీధికి చెందిన ఉండ్రాల హిమశ్రీకి ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 45,330 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ, బల్ల హరిబాబు, వెలగాడ శ్రీనివాసరావు, జంపు చంద్రశేఖర్, జి నరేంద్ర, డి సింహాచలం, తదితరులు, పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో గిరిజనులకు మేలు

ప్రజాశక్తి - సీతంపేట

కేంద్ర ప్రభుత్వ పథకాలైన పిఎం జన్మన్, ఆదికర్మయోగి, పిఎం జుగా పథకాలపై ఐటిడిఎ పరిధిలోని పంచాయతీ సెక్రటరీలకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఐటిడిఎ మీటింగ్ హాల్లో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో ఎఒ వి.సునీల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా గిరిజనులకు అధిక మేలు జరుగుతుందని, కావున ఈ పథకాల్లో ఉన్న అంశాలపై పంచాయతీ కార్యదర్శులు పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. గిరిజన గ్రామాల్లో అవసరమయ్యే మౌలిక వసతులపై శాఖల వారీగా యాక్షన్ ప్లాన్లు తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని గిరిజనులతో సమావేశమై వారి గ్రామానికి అవసరమయ్యే వసతులను గుర్తించాలన్నారు. అదే విధంగా ఆరోగ్యానికి సంబంధించి జిల్లా మాస్టర్ ట్రైనీ డాక్టర్ రవీంద్ర వైద్య విభాగానికి సంబంధించిన అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు గిరిజన పాఠశాలల్లో పంచాయతీ కార్యదర్శులు చేపట్టాల్సిన పనులపై పనులపై అవగాహన కల్పించారు. ఐటిడిఎ డిపిఒ సతీష్‌కుమార్ పిఎం జన్మన్, పిఎం జుగా, కర్మయోగి పథకాల్లోని సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని విభాగాలకు సంబంధించిన అంశాలపై పంచాయతీ సెక్రెటరీలకు శిక్షణ ఇప్పించారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ జేఇ సత్యం, హౌసింగ్ ఎఇ వెంకటేష్, విద్యుత్‌శాఖ డిఇ రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పిసిఎల్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఎన్‌పిసిఎల్ కంపెనీ పార్వతీపురం నియోజకవర్గానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర పేర్కొన్నారు. ఎన్‌సిపిఎల్ కంపెనీ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద నియోజకవర్గానికి గతంలో నాలుగు అంబులెన్సులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. తాజాగా పార్వతీపురం నియోజకవర్గానికి నాలుగు, పాలకొండ నియోజకవర్గానికి రెండు అంగన్వాడీ కేంద్రాలను మంజూరు చేసిందని చెప్పారు. వెంకంపేట, ఎంఆర్ నగరం, పెదమరికి, పుట్టూరులో నూతన భవనాలకు శంకుస్థాపనలు కూడా చేసుకున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఆ సంస్థ మేనేజరు ఆంధ్రాకు చెందిన వారు కావడంతో నియోజకవర్గానికి భారీగా నిధులు మంజూరు చేస్తున్నారని, అందుకు ఆ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది కూడా అవకాశం ఉంటే కార్పొరేట్ సామాజిక బాధ్యతగా పార్వతీపురానికి సాయం అందించాలని ఎన్‌సిపిఎల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద సోమవారం ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. సైబర్ నేరాలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సంజీవ్ తదితరులు ఉన్నారు

టెన్త్‌లో మెరుగైన ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇప్పటి నుండే క్రమశిక్షణతో ఉండి శ్రద్ధగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. టెన్త్ ఫలితాల సాధనలో మన్యం జిల్లా గత ఏడాది మంచి ఫలితాలతో మొదట స్థానంలో నిలిచిందని, అదే మాదిరిగా ఈ ఏడాది కూడా మొదటి స్థానంలో ఉండేలా ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. పాఠశాలలో వసతులు, విద్యాబోధన ఏవిధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. విద్యకు ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాగా చదువుకున్న నాడే బంగారు భవిష్యత్ చక్కదిద్దుకోవచ్చున్నారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు యోగా చేస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, చలికాలం దృష్టిలో ఉంచుకుని వేడి నీరు ఇవ్వాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో అదనంగా నిర్మిస్తున్న నూతన భవనాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఉన్నతమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఆశ్రమ పాఠశాలలో అదనపు భవన నిర్మాణాలు చేపడుతుందన్నారు. రూ. 2 కోట్ల 75 లక్షలతో పీఎం జన్‌మన్ నిధులతో అదనపు భవనాలు మంజూరయ్యాయి. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు అడ్డాకుల నరేష్, ఎఎంసి వైస్ చైర్మన్ గౌరీ శంకర్, నియోజకవర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణరావు, మాజీ మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, మాజీ ఎంపిటిసి మండంగి ప్రసాద్, నాయకులు చిన్న కొండలరావు, హితీష్ కుమార్, రామకష్ణ, జమ్మయ్య తదితరులు ఉన్నారు.

కురుపాం : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పిఎం జెన్ మన్ పథకం ద్వారా మంజూరైన రూ.2 కోట్లు 75 లక్షలు నిధులతో నూతన భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జగదీశ్వరి శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభించి మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అనేది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం ఏఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, రాష్ట్ర ట్రైకర్ బోర్డు డైరెక్టర్ పువ్వల లావణ్య, మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, పిఎసిఎస్ చైర్మన్ డొల్లు కిషోర్ కుమార్, ఎఎంసి వైస్ చైర్మన్ గౌరీశంకర్, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల భోజనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజా వైద్యం ప్రజల హక్కు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బలిజిపేట

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాల ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని, ప్రజా వైద్యం ప్రజల హక్కు అని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. బలిజపేట బస్టాండ్ వద్ద సోమవారం నిర్వహించిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి విశేష స్పందన లభించింది. కేవలం రెండు గంటల వ్యవధిలో వేల సంఖ్యలో ప్రజలు వచ్చి సంతకాలు చేసి ప్రైవేటీకరణ ఉద్యమ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం జోగారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సేకరించిన కోటి సంతకాలను ఈనెల 25న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గవర్నర్‌కు సమర్పించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వి.సాయిరాం, జెడ్‌పిటిసి అలజంగి రవికుమార్, మండల వైసిపి అధ్యక్షులు పాలవలస మురళీకృష్ణ, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు మండల ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొనాలని వైసిపి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు సరివిశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఎస్సీ సెల్ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కార్యక్రమంలో నాలుగు నియోజవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి -వీరఘట్టం

మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులకు పెండింగ్లో ఉన్న బిల్లులను తక్షణమే చెల్లించాలని సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ ప్రతి నెలా 5 తేదీలోపు వేతనాలు, బిల్లులు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.10వేలు చెల్లించాలని, యోగ డే, మెగా పేరెంట్స్ డే రోజున విద్యార్థులకు, తల్లిదండ్రులకు పెట్టిన భోజనాలు చార్జీలు వెంటనే చెల్లించాలని, పాఠశాలలో గ్యాస్ బండలు, గ్యాస్ స్టవ్‌లు ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి స్కూల్లో ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రమాదవశాస్తు మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, పథకం అమలుకు కనీస మౌలిక వంట షెడ్లు మాస్కోలు, గ్లౌజులు, యూనిఫారాలు సదుపాయాలు కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, కె.వెంకటమ్మ, ఈశ్వరమ్మ, వంట నిర్వహణ కార్మికులు పాల్గొన్నారు.



ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

అంతర్జాతీయ క్రీడాకారులను సన్మానించిన ప్రభుత్వ విప్

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

అంతర్జాతీయ స్థాయి సౌత్ ఏషియన్ పోటీలు నేపాల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో 200 మీటర్లు, 500 మీటర్లు, 5 కిలోమీటర్లు వాకింగ్, షాట్ ఫుట్, డిస్కోత్రో పోటీల్లో గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన మండంగి శ్రీనివాసరావు, బిడ్డిక చంద్రరావు, మండంగి సోమేష్ సౌత్ ఏసియాన్ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు, కాంస్య పతకాలు సాధించారు. వారినీ సోమవారం ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తన క్యాంప్ కార్యాలయంలో శాలువ కప్పి, ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇలాంటి మరెన్నో క్రీడాపోటీలు పాల్గొని పతకాలు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, దీసరి వసంతరావు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కుమ్మరివలసలో మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మొక్కజొన్నసాగుకు ఎకరాకు రూ.25వేలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు, దళారీల అమ్ముకొని నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు మొక్కజొన్న తడిచి రంగు మారిపోయిన పరిస్థితి ఏర్పడిందని, అలాగే గింజలు ఆరబెట్టే సమయంలో పరదాలు కప్పుకోవడానికి కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇన్ని కష్టాల నుండి గట్టెక్కి ఎలాగో బతకాలంటే ధర లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు కోడికాల త్రినాధచ బుచ్చియ్య, సూకుర లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ ప్రాజెక్టు జిఒ రద్దు చేయాలి

రైతు కూలీ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో ఎంతోకాలంగా పరిష్కరించబడకుండా ఉన్న భూ సమస్యలను పరిష్కరించాలని, పెత్తందారులు, భూస్వాముల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని వెంటనే పేదలకు పంచాలని సోమవారం రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మక్కువలోని పెట్రోల్ బంకు వద్ద నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ అనేక భూమి సమస్యలు పెండింగ్లో ఉన్నాయని, ఎస్.పెద్దవలస, పనసభద్ర, మార్కొండపుట్టి, శంబర, దెబ్బగడ్డ పంచాయతీల్లో భూస్వాములు, పెత్తందారులు చాలా భూములను బినామీల పేర్లతో వంద ఏళ్ల లీజుల పేర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లతో ఆక్రమించుకున్నారని ఆరోపించారు. గిరిజనులను అన్యాయం చేసే పంపుడు స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు అనుమతి ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు యు.ముత్యాలు, సహాయ కార్యదర్శి మోనంగి భాస్కరరావు, నాయకులు ప్రసాదు, అసిరి, చెంచు, వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జరడకు రోడ్డు వేయాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ గ్రామానికి రోడ్డు వేయాలని మాజీ సర్పంచ్ ఆరిక సంపన్ని, గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డికి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ నీలకంఠపురం నుంచి జరడ వరకు సుమారు 9కిలోమీటర్లు రహదారి పూర్తిగా పాడైపోయి సరైన రోడ్డు సౌకర్యం లేక తాము చాలా ఇబ్బందులుపడుతున్నామని తెలిపారు. అసలే గిరి శిఖర గ్రామమని నిత్యవసర వస్తువులు, అనారోగ్యాలకు గురైన సమయంలో కనీసం 108 వాహనం కూడా వచ్చే మార్గం లేక వైద్య సహాయం అందక చాలామంది మరణించే సంఘటనలు ఉన్నాయని, ఎన్నిసార్లు అధికారులకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రం అందించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కలెక్టర్‌కు వినతి అందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరినట్లు తెలిపారు.

పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచాలి

ప్రజాశక్తి - బలిజిపేట

రైతులకు వ్యవసాయ పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ ఎం.శ్రావణ్‌ఖుమార్‌నాయుడు తెలిపారు. బలిజిపేటలో సోమవారం జరిగిన రైతు సాధికార సంస్థ, నేషనల్ మిషన్ నేచురల్ ఫార్మింగ్‌పై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల పెట్టుబడులు తగ్గించి దిగుబడులు పెంచేలా పనిచేయాల్సిన అవసరం ఉందని, అందుకు ప్రకృతి కూడా సహకరిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అన్ని విషయాలు, సొంతంగా ఆచరిస్తూ సంబంధిత రైతులచే చేయించాలన్నారు. కార్యక్రమంలో ట్రైనర్లు, మాస్టర్ ట్రైనర్లు, అంతర్గత ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు.